

జ్యోతి క్షేత్రాన్ని పరిరక్షించుకుంటాం

జ్యోతిక్షేత్రాన్ని పరిరక్షించుకుంటామని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధలతో కలిసి జ్యోతిక్షేత్రాన్ని సందర్శించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ॥ (ఉ॥)
కడప	: 6.30	5.11
పులివెందుల	: 6.32	5.16
ప్రొద్దుటూరు	: 6.31	5.15

గరిష్టం/కనిష్టం
34.2 /19.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 19.0 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

36వ రోజుకు చేరిన సమ్మె



సమ్మె చేస్తున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ సమీపంలోని పశువైద్య కళాశాల విద్యార్థులు తమకు స్టైఫండ్ పెంచాలని చేస్తున్న సమ్మె సోమవారం 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పశువైద్య విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచే వరకు సమ్మెను విరమించమని తేల్చి చెప్పారు.

పరీక్షా ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను సోమవారం వైవీయూలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కెఎస్వీ కృష్ణారావు, డీన్ ఆచార్య ఎ.జి.దాముతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథ రెడ్డి మాట్లాడుతూ బోటని, బయోకెమిస్ట్రీ, జియాలజి, మైక్రో బయాలజి, ఫిజిక్స్ ఎన్విరాన్మెంటల్ సైన్సు, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ కాంపుటేషనల్ డేటా సైన్స్ కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. మ్యాథమ్యాటిక్స్ 75శాతం, ఫుడ్ టెక్నాలజి 95 శాతం, జువాలజి 96.43 శాతం, కంప్యూటర్ సైన్స్ 68 శాతం, బయోటెక్నాలజి 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వారు అభినందించారు. విద్యార్థులు ఫలితాల కోసం https:www.yvuexams.in/results.aspx వెబ్‌సైట్‌ను సందర్శించాలని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు విద్యార్థులకు సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్–2బి, జువాలజీ, హిస్టరీ పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 12,751 మంది విద్యార్థులకు 12,348 మంది విద్యార్థులు హాజరుకాగా 403 మంది గైర్హాజరయినట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 11,662 మంది విద్యార్థులకు 11,317 మంది హాజరుకాగా 345 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 1089 మంది విద్యార్థులకు 1031 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజయ్యారని తెలిపారు.

ముంచుకొస్తున్న జలగండం

- గ్రామాల్లో దాహం కేకలు
- శరవేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- 234 వల్నరబుల్ హ్యాబిటేషన్స్
- 1243 హ్యాబిటేషన్లలో తాగునీటి రవాణా
- అద్దె బావులు, బోర్ల ఫ్లషింగ్, డీపెనింగ్
- వేసవి కార్యాచరణ సిద్ధం చేసిన యంత్రాంగం
- కొరవడిన ప్రభుత్వ ముందుచూపు
- డైవర్షన్ పాలిటిక్స్, ప్రచార ఆర్భాటాలకు పరిమితం



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న చియ్యపాడు వాసులు



సాక్షి క్యాంపెయిన్

కడప సెవెన్‌రోడ్స్ : వేసవి తీవ్రత ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పలు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే బోరుబావులు ఎండిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మార్చి ద్వితీయార్థం కూడా రాకమునుపే జిల్లాలోని వందలాది గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. మనుషులు, పశువులకు తాగేందుకు గుక్కెడు నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి పలు గ్రామాల్లో కనిపిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి తీవ్రత ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు అవసరమైన వేసవి కార్యచరణ ప్రణాళిక రూపొందించింది. పరిస్థితి తీవ్రతను ముందే అంచనా వేసి ఈ పాటికే నివారణచర్యలు చేపట్టి ఉంటే ప్రజలకు తాగునీటి కష్టాలు కొంతవరకైనా తప్పేవి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి డైవర్షన్ పాలిటిక్స్, ప్రచార పటాటోపాలపై ఉన్న ఆసక్తి ప్రజల పట్ల లేకపోవడమే ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

గత ఏడాది జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లా సాధారణ వర్షపాతం కంటే 14.1 శాతం లోటు ఏర్పడింది. దీంతో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు జూన్ వరకు వేసవి తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని 234 వల్నరబుల్ గ్రామాలు ఉంటాయని అంచనా రూపొందించారు. అలాగే 1243 హ్యాబిటేషన్లలో 73,210 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందని అంచనా. ఇందుకోసం రూ.4.53 కోట్లు అవసరం అవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో 61 హ్యాబిటేషన్లలో బోరు బావులను అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు రూ. 24.62 లక్షలు అవసరమవుతాయి. 17 బోరుబావుల ఫ్లషింగ్ కోసం రూ. 4.85 లక్షలు, 161 బోరు బావుల డీపెనింగ్ కోసం రూ. 151.30 లక్షలు వెరసి దాదాపు 6 కోట్లు అవసరమవుతాయని కార్యాచరణ ప్రణాళికలో పేర్కొన్నారు.

- అట్లూరు, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల్లో మొత్తం 68 వల్నరబుల్ హ్యాబిటేషన్లను గుర్తించారు. ఈ మండలాల్లోని 109 హ్యాబిటేషన్లలో 11,290 ట్రిప్పుల నీటి రవాణా చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం రూ.58.16 లక్షలు అవసరమవుతాయి. అలాగే 9 హ్యాబిటేషన్లలో అద్దె బావుల కోసం రూ.3.96 లక్షలు, 11 బోర్ల ఫ్లషింగ్ కోసం రూ.3.05 లక్షలు, 61 బోరుబావుల డీపెనింగ్ కోసం రూ.44.90 లక్షలు వెరసి రూ.110.07 లక్షలు అవసరమవుతాయి.
- ఇక జమ్మలమడుగు, ముద్దనూరు, మైలవరం, పెద్దముడియం, ఎర్రగుంట్ల మండలాల్లో 20 వల్నరబుల్ హ్యాబిటేషన్లున్నాయి. 14 హ్యాబిటేషన్లలో తాగునీటి రవాణా కోసం రూ.25.15 లక్షలు అవసరమవుతాయి. ఐదు హ్యాబిటేషన్లలో అద్దె బావుల కోసం రూ.1.56 లక్షలు, ఆరు బోర్‌వెల్స్ డీపెనింగ్ కోసం రూ.3.60 లక్షలు కలిపి మొత్తం రూ.30.31 లక్షలు అవసరమవుతాయని అంచనా.
- సీకే దిన్నె, వీఎన్ పల్లె మండలాల్లో 17 గ్రామాలను వల్నరబుల్ కింద గుర్తించారు. ఈ మండలాల్లోని 907 హ్యాబిటేషన్లలో తాగునీటి రవాణా కోసం రూ. 20.86 లక్షలు, తొమ్మిది చోట్ల అద్దె బావుల కోసం రూ.2.74 లక్షలు, ఎనిమిది బోరు బావుల డీపెనింగ్ కోసం రూ. 4.80 లక్షలు మొత్తం రూ.28.40 లక్షలు అవసరమవుతాయి.
- బ్రహ్మంగారిమఠం, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు మండలాల్లో 32 హ్యాబిటేషన్లను వల్నరబుల్ కింద గుర్తించారు. ఈ మండలాల్లో 21 హ్యాబిటేషన్లలో తాగునీటి రవాణా కోసం రూ.134.87 లక్షలు, 12 అద్దె బావుల కోసం రూ.3.49 లక్షలు, రెండు బోరు బావుల డీపెనింగ్ కోసం రూ.1.20 లక్షలు వెరసి రూ. 139.56 లక్షల రూపాయలు అవసరమవుతాయని అంచనా.
- ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల్లోని 16 హ్యాబిటేషన్లను వల్నరబుల్ కింద గుర్తించారు. ఈ గ్రామాల్లో తాగునీటి రవాణా కోసం రూ. 69.50 లక్షలు, 13 చోట్ల బోరుబావుల డీపెనింగ్ కోసం రూ. 7.80 లక్షలు కలిపి మొత్తం రూ. 77.30 లక్షలు అవసరమవుతాయి.
- చక్రాయపేట, లింగాల, పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, వేంపల్లె, వేముల మండలాల్లో 69 హ్యాబిటేషన్లను వల్నరబుల్ కింద గుర్తించారు. ఈ మండలాల్లోని 171 గ్రామాల్లో తాగునీటి రవాణా కోసం రూ. 80.34 లక్షలు, 24 హ్యాబిటేషన్లలో అద్దె బావుల కోసం రూ.11.88 లక్షలు, 58 బోరుబావుల డీపెనింగ్ కోసం రూ.81.20 లక్షలు కలిపి మొత్తం రూ.173.42 లక్షలు అవసరమవుతాయి.
- ఇక సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లోని 12 గ్రామాలను వల్నరబుల్ కింద గుర్తించారు. ఐదు హ్యాబిటేషన్లలో తాగునీటి రవాణాకు రూ. 11.65 లక్షలు, రెండు హ్యాబిటేషన్లలో అద్దె బావుల కోసం 0.99 లక్షలు, ఆరు బోర్‌వెల్స్ ఫ్లషింగ్ కోసం రూ. 1.80 లక్షలు, 13 బోర్‌వెల్స్ డీపెనింగ్ కోసం రూ.7.80 లక్షలు వెరసి రూ. 22.24 లక్షలు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించడంతో పాటు నిధుల విడుదల జరిగితే వేసవి కార్యాచరణ ప్రణాళిక ప్రారంభమవుతుంది.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్షల నిమిత్తం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తామని కడప బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు భరత్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యుఎస్ కేటగిరీ అభ్యర్థులు ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు అర్హులన్నారు. అభ్యర్థులను టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థులు టెట్ పరీక్షలో అర్హత సాధించి మార్కుల జాబితా, నేటివిటీ, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫోటోలతో కడపలోని పాత రిమ్స్‌లో గల బీసీ భవనం రెండు అంతస్తులోగల తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. నిన్నటి నుంచి దరఖాస్తులు తమ కార్యాలయంలో ఇస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 9849919221, 9966418572 నంబర్లలో సంప్రదించాలని భరత్‌కుమార్‌రెడ్డి సూచించారు.

'స్టాఫ్ నర్స్' జాబితాపై అభ్యర్థనల గడువు పెంపు

కడప రూరల్ : కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఫైనల్ మెరిట్ జాబితాపై అభ్యర్థనలను స్వీకరించుటకు ఈ నెల 13వ తేదీ వరకు గడువును పెంచినట్లు వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ (జోన్–4) డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన అభ్యర్థనలను ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5.30 గంటలలోపు సమర్పించాలని పేర్కొన్నారు.

నేడు ప్రొద్దుటూరులో సిరిధాన్యాలపై సదస్సు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలి రానున్నారని కళాశాల కరస్పాండెంట్ హుస్సేన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం – ఈ ఒకే ఒక్క మార్పుతో నూరేళ్ల ఆరోగ్యం' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు.సోమవారం ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్య స్వామి, రాచరాయయోగీ స్వామి, శేఖర్ స్వామిల ఆధ్వర్యంలో మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.అనంతరం ఉత్సవమూర్తులకు రంగురంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయమాఢవీధులోల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పదిలో అగ్రస్థానమే లక్ష్యం

- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్

పదోతరగతి ఫలితాల్లో మన జిల్లా అగ్రస్థానం సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించిందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ స్పష్టం చేశారు.వ ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రత్యేక ప్రణాళికతో ముందుకువెళ్తున్నట్లు అయన తెలిపారు. ఇటీవల ప్రీఫైనల్ పరీక్షలను పూర్తి చేశామని, అందులో వెనుకబడిన వారిపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అయన తెలిపారు. పది ఫలితాలపై ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు. – కడప ఎడ్యుకేషన్



సాక్షి ఇంటర్వ్యూ

? జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను ఎంత మంది విద్యార్థులు రాస్తున్నారు

డీఈఓ : జిల్లావ్యాప్తంగా 593 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 27,800 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాస్తున్నారు. ఇందులో 14,330 మంది బాలురు, 13,470 మంది బాలికలున్నారు.

? ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

డీఈఓ : ఈనెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా 161 పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఇందుకోసం ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమావేశం నిర్వహించి నిర్వహణపై సూచనలు, సలహాలను ఇచ్చాం.

? ఎలాంటి ఫలితాలను అంచానా వేస్తున్నారు

డీఈఓ : పదోతరగతి ఫలితాల్లో వైఎస్ఆర్ జిల్లాకు చక్కటి రికార్డు ఉంది. గతంలో పలుమార్లు రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. ఈ యేడాది కూడా నంబర్‌వన్‌గా నిలిచేందుకు కృషి చేస్తున్నాం.

? ఫలితాల మెరుగునకు ఎలాంటి చర్యలు చేపట్టారు

డీఈఓ : పదో తరగతి ఫలితాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ప్రతిరోజూ విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణతో పాటు సిలబస్ సకాలంలో పూర్తి చేయడం, ప్రీఫైనల్ పరీక్షల ఫలితాల ఆధారంగా పాఠశాల విద్యార్థుల స్థాయిని అంచనా వేసి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా మార్గనిర్దేశం చేశాం. విద్యార్థులు ఎలా చదువుతున్నారో నిత్యం ఉపాధ్యాయుల ద్వారా ఫీడ్‌బాక్ తీసుకుంటున్నాం.

? కేంద్రాల్లో సౌకర్యాల గురించి..

డీఈఓ : ఇప్పటికే పరీక్షా కేంద్రాలను గుర్తించి, కేంద్రంలో విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేశాం. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాం.

? గ్రామీణ ప్రాంత విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

డీఈఓ : గ్రామీణ, దూర ప్రాంత విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా అధికారులు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్‌టికెట్ చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

? జిల్లాలో ఎన్ని సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం

డీఈఓ : జిల్లావ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. ఇందులో కమలాపురం, బి.మఠం, బి.కోడూరు, కొండాపురం, వేంపల్లి, సింహాద్రిపురం జిల్లా పరిషత్తు హైస్కూల్స్‌ను గుర్తించాము. వీటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం

? పరీక్షల విధుల్లో ఎంతమంది స్క్వాడ్ బృందాలు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు

డీఈఓ : జిల్లా వ్యాప్తంగా 161 పరీక్షా కేంద్రాల్లో 1300 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. వీరితో పాటు 161 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 161 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించాం.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి
– జేసీ అదితిసింగ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలన్నారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు.

- తనకు ఎన్టీఆర్ వితంతు పెన్షన్ మంజూరు చేయాలని ఖాజీపేట నందిపాడుకు చెందిన లింగారెడ్డి రవణమ్మ కోరారు.
- తన భర్త ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ 1999లో మరణించారని, కారుణ్య నియామకం కింద పిల్లలకు ఉద్యోగం మంజూరు చేయాలని చింత కొమ్మదిన్నె మండలం అంగడి వీధికి చెందిన వీఆర్ శుభాషణమ్మ విన్నవించారు.
- కాశినాయన మండలం వరికుంట్ల గ్రామానికి చెందిన పి.నాగమ్మ సర్వే నెం.140లో 0.40 సెంట్లు స్థలం కలదని, అందులో తన ఇంటి స్థలానికి సర్వే చేయించి హద్దులు చూపే వరకు పక్కవారు నిర్మాణం నిలుపుదల చేయించాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, ఎస్డీసీ వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవకు..గడ్డుకాలం!

- ఊగిసలాటలో ఉచిత 'వైద్య సేవ'
- సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఆందోళన
- 12న 'ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌సీఈఓతో చర్చలు
- అనంతరం కార్యాచరణకు సన్నద్ధం



జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వివరాలు

వైద్య మిత్రులు, ఇతర సిబ్బంది **115**
నెట్‌వర్క్ ఆస్పత్రులు **108**
ఆరోగ్యశ్రీ కార్డులు **5.10** లక్షలకు పైగా

వ్యాధుల సంఖ్య పెంపు వివరాలు

2007 (మొదటి విడత)	542
2008 (రెండో విడత)	1,040
2021	2434
2022	3255

కడప రూరల్ : అనారోగ్యంతో ఉన్న పేదల జీవితాల్లో ఆరోగ్య వెలుగులు నింపే బృహత్తర పథకం 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'కు గడ్డుకాలం వచ్చింది. నాడు 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ' ద్వారా పథకం పటిష్టవంతంగా మారింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'గా మార్పు చేసింది. పేరు మార్పుతో పాటే పథకం అమలు అస్తవ్యస్తంగా సాగుతోంది. ఏకంగా అందులో పనిచేసే సిబ్బంది తమ ఉద్యోగ భద్రత కోసం ఆందోళన బాట పట్టడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అదుపుతప్పింది. అటు సిబ్బందికి అభద్రతాభావం ఏర్పడింది. ఇటు పేదలకు దీని అమలుపై అనుమానపు నీడలు కమ్మాయి. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది మరో మారు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు సిద్ధం అయ్యారు.

పథకం విచ్ఛిన్నానికి పన్నాగాలు

టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతోనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చడం అందరికీ తెలిసిందే. కాగా పేరు మార్పు తోపాటు ఇందులో కూడా అనూహ్యమైన మార్పులను తీసుకు ఆందోళన కలిగిస్తోంది. అందులో భాగంగా కొన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉన్న అయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో కూడా తీసుకొచ్చి దానికి బీమాను అనుసంధానం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం మొదలు పెట్టింది. దీంతో ఏళ్ల తరబడి ఆరోగ్యశ్రీని నమ్ముకుని పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల్లో (నేడు వైద్య మిత్రలు) ఆందోళన మొదలైంది. ఆరోగ్యశ్రీ ఇన్‌స్రూ పరిధిలోకి వెళితే ఆ సంస్థకు చెందిన వారు తమను తీసివేసి మరొకరిని నియమిస్తారనే వాదన బలంగా వినిపిస్తోంది. వాస్తవానికి జరిగేది కూడా అదే కావడంతో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అభద్రత నెలకొంది. దీనికితోడు ఈ వైద్య సేవలు బీమా పరిధిలోకి వెళితే వ్యాధుల సంఖ్యతోపాటే ప్యాకేజీ గణనీయంగా తగ్గనుంది. దీంతో ఆరోగ్యశ్రీలో ఉండే ప్రయోజనాలు, బీమా వల్ల వచ్చే ఉపయోగాలు ఏమాత్రం ఉండవన్నది స్పష్టంగా అర్థమవుతోంది.



కొలిక్కిరాని చర్చలు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న వైద్య మిత్రలు టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుకోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నిరవధికంగా సమ్మెకు వెళ్లడానికి సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. దీంతో 2024 నవంబరు 13వ తేదీన ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈఓ డాక్టర్ డి.లక్ష్మీషాతో చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు కొలిక్కి రాలేదు. ఈ సందర్భంగా సీఈఓ లక్ష్మీషా కొద్దిరోజులు ఆగమని చెప్పడంతో ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది ఓపిక పట్టారు. నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మళ్లీ ఆందోళన బాట పట్టడానికి శ్రీకారం చుట్టారు.


వైస్సార్ సీపీ పాలనలో ఉద్యోగ భద్రతకు చర్యలు

వైఎస్సార్ సీపీ పాలనలో ఆరోగ్యశ్రీలో పని చేసే సిబ్బంది ఉద్యోగ భద్రతకు, వేతనాల పెంపునకు చర్యలు చేపట్టారు. ఆ మేరకు టీం లీడర్లను సీనియర్ అసిస్టెంట్లుగా, ఆరోగ్య మిత్రలను జూనియర్ అసిస్టెంట్ లేదా డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పరిగణించడంతోపాటు అందుకు తగిన వేతనాలు మంజూరు చేయాలని సంకల్పించింది. తద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ఆరోగ్యశ్రీలో పని చేసే సిబ్బందికి కూడా ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఆ ప్రకారం ఫైల్ నంబరు 1334631 సిద్ధమైంది. ఇందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారు. దీంతో ఆరోగ్యమిత్రల్లో సంతోషం నెలకొంది. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. తర్వాత వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ ఫైలును పూర్తిగా ప్రక్కన పడేసిందని సిబ్బంది వాపోతున్నారు.

▸▸ 2007లో 'ఆరోగ్య శ్రీ'కి శ్రీకారం..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా 2007–08లో పేదలకు ఉచిత వైద్యానికి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా నిరుపేదలు ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో సునాయాసనంగా ఉచిత వైద్య సేవల ద్వారా పునర్జన్మను పొందారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారు. నిరుపేదలకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా చీకు చింత లేకుండా ఒక్కపైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యసేవలు పొందడం ద్వారా నిశ్చింతగా జీవనం సాగిస్తున్నారు. అలాంటి గొప్ప పథకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో బీటలు పడడం ప్రారంభమైంది.

విధుల బహిష్కరణను తాత్కాలికంగా వాయిదా వేశాం...



ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10, 17, 24 తేదీల్లో విధులను బహిష్కరించాలని పిలుపునిచ్చాం. ప్రతి సోమవారం రోజున విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టాలని నిర్ణయించాం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఆ మేరకు ఈ నెల 12వ తేదీన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈఓ పీ రవిసుభాష్‌తో చర్చలు ఉన్నాయి. అందువల్ల ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేశాం. చర్చల అనంతరం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తాం. – విజయ్, జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, వైద్యమిత్రల సంఘం

క్లుప్తంగా

పొలంలో దారి విషయమై ఘర్షణ

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి, గంగిరెడ్డి, జనార్దన్‌రెడ్డిలు సోమవారం పొలం వద్ద దారి విషయమై గొడవ పడ్డారు. పోలీసుల కథనం మేరకు...మనోహర్‌రెడ్డికి చెందిన అరటి చెట్లు, నిమ్మ, వేపచెట్లను అన్నదమ్ములైన గంగిరెడ్డి, జనార్దన్‌రెడ్డిలు జేసీబీతో పీకివేయించారు. మనోహర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు అన్నదమ్ములపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు



కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

కడప కోటిరెడ్డి సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తలపెట్టిన ఆందోళన సందర్భంగా జిల్లాలో అంగన్‌వాడీ వర్కర్లను అరెస్టు చేయడం, నిర్బంధించడం సరైంది కాదని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు బి.మనోహర్, నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26వేలకు జీతం పెంచితే ఇలాంటి ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉండదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయడం మానుకొని అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణాచారి, జిల్లా నాయకుడు ఎ.రామ్మోహన్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీఐటీయూ నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి ఘటనపై నిరసన ప్రదర్శన



కడపలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ పారువేట ఉత్సవం సందర్భంగా ఈనెల 4వ తేదీ చోటుచేసుకున్న ఘటనలకు నిరసనగా విశ్వహిందూ పరిషత్ నాయకులు వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగరంలో ప్రదర్శన నిర్వహించారు. మృత్యుంజయకుంట శివాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా కలెక్టరేట్ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నందారపు చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా పారువేట ఉత్సవాన్ని నిర్వహిస్తున్నవారిపై మరో వర్గంవారు దాడి చేశారని ఆరోపించారు. వారిని అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

అల్లాహ్ ప్రార్థనకు పిలుపు.. అజాన్

రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో కథనం



కడప కల్చరల్ : తెల్లవారుజాము సమయం. చిరు చీకట్లను తరిమివేస్తూ వెలుగు రేఖలు విచ్చుకుంటున్న వేళ. ఆ ప్రశాంత సమయంలో 'అల్లాహు అక్బర్' అంటూ గంభీరమైన స్వరం. అల్లాహ్‌ను ప్రార్థించేందుకు రమ్మంటూ ఇస్తున్న పిలుపు హృదయాన్ని తాకుతున్న ఆ ఆహ్వానాన్ని అందుకుని మన సారా దైవ ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్న ముస్లింలు. మసీదులలో దైవ ప్రార్థనలకు రావాలంటూ తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఐదుమార్లు ఇలా అజాన్ పిలుపు వినిపించడం అందరికీ తెలిసిందే. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ప్రతిరోజు ఐదుసార్లు నమాజ్‌ను అధిక సంఖ్యలో మసీదులకు తరలివచ్చి ఆచరిస్తారు. ఇందులో భాగంగా అజాన్ గురించి కడప నగరానికి చెందిన ధర్మ పరిచయ కమిటీ ప్రతినిధి హజరత్ సయ్యద్ అహ్మద్ (బాబుభాయ్) ఇలా వివరిస్తున్నారు.

ప్రపంచంలోని ముస్లింలందరికీ ఈ పవిత్ర రంజాన్ మాసం ప్రాణప్రదమైనదిగా భావిస్తారు. ఈ జన్మకు ముక్తిని ప్రసాదించే దివ్య వరంగా భావించి ఈ సందర్భంగా దైవం సూచించిన మార్గాలలో తప్పక అనుసరిస్తారు. సాధారణ రోజుల్లో ఆచరించే ప్రార్థనలతోపాటు ప్రతిరోజు తరావీ ప్రార్థనలు చేయడం ఈ మాసం ప్రత్యేకతగా చెప్పవచ్చు. కేవలం రంజాన్ మాసంలోనే గాక మిగతా రోజుల్లో కూడా ముస్లింలు రోజూ ఐదు మార్లు ప్రార్థనలు చేస్తారు. రోజువారి పనుల్లో నిమగ్నమైన వారికి ప్రార్థనా సమయం ఆసన్నమైందని తెలుపుతూ మసీదుల్లోని మౌజన్లు 'అల్లాహు అక్బర్' అంటూ పిలుపునిస్తారు. అజాన్ విన్న వెంటనే వీలైనంత త్వరగా మసీదులకు చేరుకుని ప్రార్థనలు చేస్తారు. ఆజాన్‌లో వచ్చే వాక్యాలు అరబ్బీ భాషలో ఉన్నాయి. ఐదు పూటల నమాజుకు ముందు సమీపంలోని ముస్లింలందరికీ ప్రార్థనలకు వేళ అయిందని సూచిస్తూ ఇచ్చే ఈ పిలుపు ముస్లింల రోజువారి జీవితంలో ఒక భాగమైంది. ఈ పిలుపు వినగానే అసంకల్పితంగా ముస్లింలు మసీదు వైపు వెళతారు. అజాన్ అర్థం తెలిసిన వారు మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

అజాన్ వెనుక కథ

ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను సామూహికంగా ఆరాధించేందుకు ప్రజలందరికీ ఎలా సమీకరించాలన్న విషయంపై ప్రవక్త తన అనుచరులతో సంప్రదింపులు జరిపారు. 'బూర' ఊది గుర్తించాలని కొందరు, డోలు మోగిస్తే బాగుంటుందని మరికొందరు, జెండా ఊపితే మంచిదని మరికొందరు ఇలా రకరకాల సలహాలు ఇచ్చారు. ఈ విషయంగా అబ్దుల్లా బిన్ జైద్ ర.జి. దీర్ఘంగా ఆలోచించడం ప్రారంభించారు. ఒక రాత్రి కలలో ఇప్పుడు మనం వింటున్న అజాన్ పిలుపులోని మాటలను ఆయన అనుభూతించారు. ఈ విషయాన్ని మహా ప్రవక్తకు తెలిపారు. హజరత్ ఉమర్ ర.జి.లు కూడా ఇదే కలగన్నారు. విషయం తెలుసుకున్న ప్రవక్త మహనీయుడైన ఉమర్‌ను పిలిచి వచ్చిన కల గురించి అడిగారు. తనకంటే ముందు అబ్దుల్లా బిన్ జైద్ ఈ కల గన్నారని, కనుక ఆయన ద్వారానే వివరాలు వినడం మంచిదని భావిస్తున్నామని ఉమర్ తెలిపారు. ప్రవక్త తన ప్రియ సహచరుడు హజరత్ బిలాల్ ర.జి.ని పిలిచి అబ్దుల్ బిన్ జైద్ ఏ వాక్యాలు పలుకుతారో వాటిని మీరు గొంతెత్తి గట్టిగా పలకాలని ఆదేశించారు. ఆ వాక్యాలకు అజాన్ అనే పేరు ఖరారైంది.

మసీదుల్లో అజాన్ పిలుపునిచ్చే వ్యక్తిని మౌజన్ అంటారు. ఈ పిలుపు ద్వారా 'ఓ మానవులారా అల్లాహ్ సర్వోన్నతుడు.. గుణ విశేషణాలలో అద్వితీయుడు.. స్వయం ప్రభువు, ఆది మధ్యాంత రహితుడు, అనంతుడు, పోలిక లేనివాడు, నిర్వికారుడు, సమస్త సృష్టికి నిర్దేశకుడు, సర్వశక్తివంతుడు, అంతర్యామి, సృష్టికర్త' అని వివరిస్తాడు.

అజాన్.. దాని అర్థం ఇలా ఉంది
అల్లాహు అక్బర్...అల్లాహు అక్బర్...
అల్లాహు అక్బర్....అల్లాహు అక్బర్...
(అల్లాహ్ సర్వోన్నతుడు)
అష్‌హదు అన్ లాయిలాహ ఇల్లల్లాహ్
అష్‌హదు అన్ లాయిలాహ ఇల్లల్లాహ్
(అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కాదని నేను సాక్ష్యం ఇస్తున్నాను)
అష్‌హదు అన్న మహమ్మదర్రసూలుల్లాహ్
అష్‌హదు అన్న మహమ్మదర్రసూలుల్లాహ్
(మహమ్మద్(సొ.అ.వ) అల్లాహ్ సందేశహరులు అని నేను సాక్ష్యం పలుకుతున్నాను)
హయ్య అలస్సలాహ్....హయ్య అలస్సలాహ్
(రండి నమాజ్ వైపునకు రండి)
హయ్య అలల్‌ఫలాహ్...హయ్య అలల్‌ఫలాహ్
(రండి సాఫల్యం వైపునకు)
అస్సలాతు ఖైరుమ్ మిన్నన్నౌమ్
అస్సలాతు ఖైరుమ్ మిన్నన్నౌమ్
(నిద్రకన్నా నమాజ్ ఉత్తమమైనది)
అల్లాహు అక్బర్....అల్లాహు అక్బర్
(అల్లాహ్ సర్వోన్నతుడు)
లా ఇలాహ ఇల్లల్లాహ్
(అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధ్యులు లేరు)

'అస్సలాతు ఖైరుమ్ మిన్నన్నౌమ్'- ఈ వాక్యాలను తెల్లవారుజామున ఇచ్చే అజాన్‌లో మాత్రమే పలుకుతారు.

గ్రహణ మొర్రి నిర్ధారణ పరీక్షల శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష స్టేట్ ట్రెనింగ్ అండ్ ప్రోగ్రాం ఆఫీసర్ కల్పన శైల

కడప ఎడ్యుకేషన్ : బసవతారకం, ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో సోమవారం కడప సమగ్రశిక్ష కార్యాలయంలో గ్రహణ మొర్రి నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరాన్ని సమగ్రశిక్ష స్టేట్ ట్రెనింగ్ అండ్ ప్రోగ్రాం ఆఫీసర్ కల్పన శైల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బసవతారకం హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ ముకుందరెడ్డి వైద్యసేవలందించారు. 11 మంది బాధితులు హాజరై పరీక్షించుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

చింతకొమ్మదిన్నె : ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె ఏఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. గోపాలపురం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి భార్య గజ్జల యశోద కిందపడి వెన్నెముక ఆపరేషన్ చేయించుకుంది. ఆ నొప్పి భరించలేక 8వ తేదీ విష ద్రావణం తాగింది. కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు, మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాలుష్యం నుంచి కాపాడండి



ఆర్డీఓకు తమ సమస్యలను వివరిస్తున్న దుగ్గనపల్లి గ్రామ మహిళా రైతులు

జమ్మలమడుగు : దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని అయితే అందులో నుంచి వస్తున్న బూడద వల్ల తమ పంట పొలాలకు తీవ్ర నష్టం కలుగుతోందని మైలవరం మండలం దుగ్గనపల్లి గ్రామానికి చెందిన రైతులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఆర్డీఓ సాయిశ్రీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ దాల్మియా ఫ్యాక్టరీని వంకకు అడ్డంగా నిర్మించారన్నారు. ప్రహరీ నిర్మాణం వల్ల ఆలుగోకు వంక ఏటా వచ్చి తమ పంటలను నాశనం చేయడంతోపాటు రోజుల తరబడి నీరు పొలాల్లో నిల్వ ఉంటోందన్నారు. ఈ కారణంగా వేసిన పంటలు కుళ్లిపోయి తీవ్ర నష్టం వస్తోందని వారు వాపోయారు. విస్తరణ పనుల కోసం ఈనెల 27వతేదీన చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే అధికారులు నిలుపుదల చేయాలని కోరారు.

క్రిమినల్ కేసులు పెట్టాలి

సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా చీపాటి మోషే అనే రైతు సాగు చేసిన మిర్చి పంట నాణ్యత లేకుండా పోయిందన్నారు. ఈ పంటను గుంటూరు మార్కెట్ యార్డులో విక్రయించేందుకు వెళితే అక్కడి వ్యాపారులు నాణ్యత లేని కారణంగా తక్కువ ధరకు అమ్మాలని కోరడంతో మిర్చిని మార్కెట్ యార్డులోనే వదిలేసి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పంట నష్టపోవడానికి, రైతు ఆత్మహత్యకు కారణమైన దాల్మియా యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రైతులు డీఎస్పీ వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు.

సమస్యలపై ఆర్డీఓ ఆరా

మైలవరం : మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో గత కొద్దిరోజులుగా దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ వల ఎదురవుతున్న సమస్యలపై ఆర్డీఓ సాయిశ్రీ ఆరా తీశారు. సోమవారం ఆమె గ్రామంలో పర్యటించారు. దాల్మియా కంపెనీ బ్లాస్టింగ్ చేయడం వల్ల గ్రామంలోని ఇళ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని, వంకకు అడ్డంగా గోడ కట్టడం వల్ల పొలంలో నీరు నిల్వ ఉండి పంట పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆమె దృష్టికి తెచ్చారు.

ఆర్టీసీ బస్సులో 7 తులాల బంగారు నగలు చోరీ

ముద్దనూరు : ముద్దనూరు నుంచి పులివెందులకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళకు చెందిన సుమారు 7 తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాధితురాలి కథనం మేరకు.. జమ్మలమడుగు నుంచి సౌజన్య అనే మహిళ ఈనెల 8వతేదీన శనివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో పులివెందుల వెళ్లేందుకు ముద్దనూరులో బస్సు ఎక్కింది. ఆమె భర్త సౌజన్యను బస్సులోకి ఎక్కించి బ్యాగును అందజేసి వెళ్లిపోయాడు. గంట తర్వాత ఆమె పులివెందులలో దిగి బ్యాగు తీసుకుని చూసుకుంది. ఆమె బ్యాగు లోపల చిన్న కవర్లలో పెట్టి ఉన్న 3 రకాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ముద్దనూరు నుంచి పులివెందుల ప్రయాణ సమయంలో ఆమె బ్యాగులో దాచిన బంగారు నగలను ఎవరో దొంగిలించారని, బంగారు నగలు దాచిన బ్యాగును తన సీటు కిందనే ఉంచుకున్నట్లు బాధితురాలు తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్రాన్ని పరిరక్షించుకుంటాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కూల్చివేసిన స్నానపు గదులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కలసపాడు : శ్రీ అవధూత కాశినాయన జ్యోతిక్షేత్రాన్ని పరిరక్షించుకుంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో కలిసి జ్యోతిక్షేత్రాన్ని సందర్శించారు. ఇటీవల జ్యోతిక్షేత్రంలో మహిళల స్నానపుగదులు, క్షౌ రశాల, గోశాల, విశ్రాంతి గదులను అటవీశాఖ అధికారులు కూల్చివేసిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు దేవాలయాల వద్ద నిత్యాన్నదాన సత్రాలు ఏర్పాటు చేసి కాశినాయన అన్నదానం కొనసాగించారన్నారు. జ్యోతిక్షేత్రంలో ఆయన పరిత్యాగం చెందారని, ఆయన ఆలయాన్ని నిర్మించేందుకు అటవీశాఖ ఇబ్బందులు సృష్టించడం దురదృష్టకరమన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి సహకారంతో జ్యోతిక్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. 2019 నుంచి అటవీశాఖ అనుమతి కోసం కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు తీవ్రంగా కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో అటవీశాఖ మంత్రిగా ఉన్న పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మవాదియై జ్యోతిక్షేత్రంలో కూల్చివేతలపై స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ కాశిరెడ్డినాయన భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అటవీశాఖ అధికారులు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పీఆర్ఆర్‌డీ మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఆప్కాస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణ యాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పులి వీరారెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పరీక్షా కేంద్రాల మార్పులు

రాయచోటి జగదాంబసెంటర్ : మదనపల్లె పట్టణంలో ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షా కేంద్రాల్లో మార్పులు, చేర్పులు చేశారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో జ్ఞానాంబిక జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల రెండు పరీక్షా కేంద్రాలు ఒకే బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపించాలని అనేకమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, బన్నీ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి అకాడమి ఏర్పాటు చేయాలి



సేవారత్న పురస్కారాలను అందుకుంటున్న మహిళా ప్రముఖులు

కడప కల్చరల్ : కడప నగరంలో తొలి తెలుగు రామాయణ రచయిత్రి మొల్లమాంబ పేరిట తెలుగు సంస్కృతి అకాడమిని ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా వికాస ఉద్యమం, మొల్ల సాహితీ పీఠం అధ్యక్ష కార్యదర్శులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, మనోజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సాహితీ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ మొల్లమాంబ మన ఆడబిడ్డ కావడం తెలుగుజాతి చేసుకున్న అదృష్టమన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ మొల్లమాంబ స్ఫూర్తితో మహిళలు తమలోని ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, జింకా సుబ్రమణ్యం, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యక్షుడు తుపాకుల నారాయణ, కోశాధికారి నూనె నాగేష్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పార్వతి, అపూర్వ సుందరి, కమాల్ బీలకు మహిళా సేవారత్న పురస్కారాలను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, సాహిత్య పీఠం ఉపాధ్యక్షుడు పెండ్లిమర్రి మల్లయ్య, పార్వతమ్మ, పెన్షనర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, మహిళా కార్యదర్శి కొండూరు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

చాపాడు : మండల పరిధిలోని నెర్రవాడ గ్రామంలో సోమవారం ఉదయం చల్లా వెంకటరమణ, గొగ్గిదేవి వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. వీరి కుటుంబాల మధ్య పొలం తగాదా, డబ్బులు బాకీ వ్యవహారంపై గత కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సోమవారం చల్లా వెంకటరమణ తనతో పాటు తన భార్యపై గొగ్గి దేవి, పెద్దిరాజు, ఓబులేసు, పిట్టి లక్ష్మీనారాయణ, సాయికుమార్, పాపయ్య, అమరావతి దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే గొగ్గిదేవి, అతని భర్తపై చల్లా వెంకటరమణ, మణికంఠ, రామసుబ్బమ్మ దాడి చేసినట్లు గొగ్గిదేవి ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు

అట్లూరు : గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుబ్బలక్షుమ్మ, ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. వివరాలిలా..మండల పరిధిలోని వేమలూరు గ్రామంలో రాచంరెడ్డి వెంకటరెడ్డి ఇంటి ఎదుట కొంత గ్రామ కంఠం స్థలం ఉంది. కొన్ని దశాబ్దాల నుంచి ఆ స్థలంలో ఆ కుటుంబ సభ్యులతో పాటు ఇరుగు పొరుగు వారు కూడా కూర్చునేవారు. అయితే రోడ్డుకు పడమర వైపు ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన వారు ఆ స్థలం తమదని ఎవరూ వాహనాలు పెట్టడం కానీ స్థలాన్ని శుభ్రం చేయడం కానీ చేయవద్దని పేర్కొన్నారు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. అలాగే పరస్పరం తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేసుకోవడంతో సోమవారం తహసీల్దార్‌తో పాటు ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి విచారణ చేపట్టారు. అయితే ఈ స్థలం గ్రామ కంఠమే అయినా తమ ఇంటి ముందు ఉందన్నారు. అయితే రోడ్డుకు పడమర వైపు ఉన్న వాళ్లు రోడ్డు దాటుకుని వచ్చి ఆ స్థలం తమదని చెప్పడం సబబేనా? అంటూ రాచంరెడ్డి వెంకటరెడ్డి వర్గం ప్రశ్నిస్తోంది. ఆ స్థలంపై తమకు హక్కు ఉందని టీడీపీకి చెందిన వర్గం అనడంతో తహసీల్దార్, ఎస్‌ఐ సమగ్ర విచారణ చేపట్టనున్నారు.